## క్లుప్తంగా

### వ్యాయామంతో మానసిక ఒత్తిడి దూరం



**నకరికల్లు:** వ్యాయామం మానసిక ఒత్తిడిని దూరం చేయడంతో పాటు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు బి.నాగమణి పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల అధిక బరువు తగ్గి మానసిక ప్రశాంతత, మంచి నిద్ర వస్తుందని తెలిపారు. ర్యాలీని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ. కె.మల్లయ్య, విద్యార్థులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### రేపు సర్వసభ్య సమావేశం

**సత్తెనపల్లి:** సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం గురువారం ఎంపీపీ షేక్ ఎలవర్తి పాటి జైబున్‌బీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎక్స్ అఫిషియోగా రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. జడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు హాజరు కావాలని తెలిపారు.

### దశ్శరభల ప్రదర్శన



**అచ్చంపేట:** భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పళ్లెర మహోత్సవంలో భాగంగా వీరశైవ లింగాయత్ వీరభద్రస్వామి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దశ్శరభల ప్రదర్శన గ్రామస్తులను ఎంతో ఆకట్టుకుంది. వీరశైవ ఖడ్గాలు, నారసములు చేతబట్టి సోమవారం శరభమాల పఠిస్తూ వీరంగం చేశారు. అష్ట హారతులతో స్వామికి పూజలు నిర్వహించారు. లలిత, లక్ష్మీ తిరుపతమ్మతల్లి, విష్ణు సహస్రనామార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్లు

**అమరావతి:** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేతుల మీదుగా క్షయ రోగులకు అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ క్షయమిత్ర కార్యక్రమం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రవిబాబు మాట్లాడుతూ ఈ కిట్లలో 3 కిలోల బియ్యం, కందిపప్పు, వేరు శనగ గుళ్ళు, బెల్లం, వంట నూనె, గోధుమ పిండి, రాగి పిండితో పాటుగా శనగపప్పు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చందూలాల్, ఎం.డి.ప్రసాద్, సౌజన్యతోపాటుగా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యమేళా ర్యాలీ

**క్రోసూరు:** ఆయుష్మాన్ భారత్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అందరికీ ఆరోగ్యం అనే అంశంపై మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని సబ్‌సెంటర్ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా హెల్త్‌సెంటర్లలో ముందుగా క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆహారపు అలవాట్లు, యోగా, నడక, ధ్యానం వల్ల ఆరోగ్యం బాగుంటుందని వివరించారు. మాంసాహారం తగ్గించి శాఖాహారం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవాలని, ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలని కోరారు. బీపీ, షుగరు, క్యాన్సర్ రోగాలపై అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

### జూదరులపై కేసు

**శావల్యాపురం:** మండలంలోని కొత్తలూరు గ్రామంలోని నీళ్ల ట్యాంకు సమీపాన పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా 8 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 9,230లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై గల్లా రవికృష్ణ మంగళవారం తెలిపారు.

### గ్రంథాలయం తనిఖీ

**చిలకలూరిపేటటౌన్:** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠకులకు కావల్సిన పోటీ పరీక్షల పుస్తకాలను త్వరలో అందుబాటులో తెస్తానన్నారు. గ్రంథాలయంలో పుస్తకాల వివరాలు తెలుసుకున్నారు.

# పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 31వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

**సత్తెనపల్లి:** రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ..ఎన్నికల హామీలను మూడున్నరేళ్లపాలనలో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలకు పెత్తనం కట్టబెట్టి అర్హులకు కూడా సంక్షేమ పథకాలు అందించలేదని ఆరోపించారు. ప్రస్తుతం అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించడం జరుగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదలకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంత చేస్తున్నా టీడీపీ నాయకులు వచ్చి మాయ మాటలు చెబితే వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతివ్వాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు.

**సమస్యలు వింటూ... సంక్షేమాన్ని వివరిస్తూ..!**

గడప గడపకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్ర జలవరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముందుకు సాగారు. 31వ వార్డులో ప్రజలు విన్నవించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకతీతంగా స్థానిక సమస్యలను ఓపిగ్గా విని వాటి పరిష్కారానికి సచివాలయాలకు విడుదల కానున్న నిధులను వినియోగించాలన్నారు. ముందుగా మహిళలు మంగళ హారతులతో మంత్రికి స్వాగతం పలికారు. కార్య క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, కమిషనర్ కొలిమి షమ్మీ, నాయకులు అచ్యుత శివప్రసాద్, ఆకుల హనుమంతరావు, గని, పెండెం బాబూరావు, జూపల్లిపాల్, కోడిరెక్క దేవదాస్, జొన్నలగడ్డ ఆనంద్, గుంటూరు ఆశీర్వాదం, ఉల్లంఘుల ప్రసాద్, వరికల్లు కోటేశ్వరరావు, వరికల్లు కోటి లింగం, అనీల్, చేవూరి మధు, పెద్దింటి వెంకటేశ్వర్లు, ఎస్‌ఎం యూనస్, కాటుమాల డేవిడ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు పేదలకు వరాలు

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**పెదకూరపాడు:** రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పేదల పాలిట వరాలని, పేదల కష్టాలు తెలుసుకొని వారికి అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని బుచ్చియ్యపాలెం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి, కరపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వారి సమస్యలు విని అక్కడికక్కడే పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఇంకా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సీఎం వైఎస్ జగన్ తీసుకొస్తున్న విధానాలు, సంక్షేమ పథకాలు, సంస్కరణలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీకి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాగులూరి అనిల్ కుమార్, పార్టీ నాయకులు కంకణాల శివాజీ, సర్పంచ్ క్రాపా పద్మవతి, వైస్ సర్పంచ్ పర్చూరి రామకృష్ణ, మండల పార్టీ నాయకులు క్రాపా వీరసింహం, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబు

- నేడు మహా శివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ
- మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఈ నెల 18న శాంతి కళ్యాణం



గుంటూరు రోడ్‌లోని శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం



శివుని విగ్రహం

**సత్తెనపల్లి:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం నుంచి మహా శివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అచ్చంపేటరోడ్‌లో ఉన్న శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి ఆలయాలు, గుంటూరు రోడ్డులోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఏకాదశి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. 16న లక్ష్మీ గణపతి హోమం, రుద్ర హోమం, 17న సామూహిక కుంకుమార్చన, 18న గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, లింగోద్భవ కాల దర్శనం, దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. అన్న సంతర్పణ చేస్తారు. శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో మహా శివరాత్రి పురస్కరించుకొని శివ కల్యాణం, లింగోద్భకాల అభిషేకాలు నిర్వహించనున్నారు. పంచామృతాలతో అభిషేకాలు, పార్వతీ పరమేశ్వరులకు, గోవింద మాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామికి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం అన్న సంతర్పణ చేపట్టనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న దృష్ట్యా వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### కుట్టుమిషన్లు అందజేత



మిషన్‌లను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

**రాజుపాలెం:** మహిళలు టైలరింగ్ నేర్చుకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని పుష్ప కుట్టు సెంటర్‌లో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు పుష్ప సంస్థ డైరెక్టర్ గుమ్మడి శ్యామ్‌కుమార్‌తో కలిసి ఆయన సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. కుట్టు మిషన్ నేర్చుకున్న పదిమంది మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తోటకూర యోహాన్ రాజు, గుమ్మడి విద్యాసాగర్, వీఎస్‌ఏ ముద్రే సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటీఎస్‌తో రుణవిముక్తులు కండి



**అచ్చంపేట:** ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) ద్వారా గృహ లబ్ధిదారులు రుణ విముక్తులు కావాలని సర్పంచ్ కంబాల వీరబాబు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకుని బకాయిలు చెల్లించిన లబ్ధిదారులకు మంగళవారం ఆయన రుణవిముక్తి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ అచ్చంపేట పార్టీ కన్వీనర్ షేక్ సైదాసాహెబ్, చెన్నకేశవులు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు దరఖాస్తులను పరిశీలించండి



**ముప్పాళ్ళ:** ఓటు హక్కు కోసం వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిశీలించాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా అందిన అర్జీలపై విచారణ చేసి, అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలని స్పష్టం చేశారు. ఓటరు కార్డుకు ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో డీటీ సీహెచ్‌లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకోండి



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న డీడీ రత్నమంజుల, మురళి

**సత్తెనపల్లి:** ప్రతి రైతు ఈ- పంటలో పంట వివరాలు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రత్న మంజుల పేర్కొన్నారు. రబీలో సాగు చేసినటువంటి పంటలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసేందుకు మంగళవారం పాకాలపాడు గ్రామాన్ని వ్యవసాయశాఖ అధికారులు సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ-పంట నమోదు ద్వారా వైఎస్సార్ ఉచిత పంటల బీమాను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్ట పరిహారం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, ఏడీఏ సీహెచ్ రవికుమార్, అరుణ చంద్ర, ఎస్.శ్రీధర్‌రెడ్డి, వీఆర్వో కె.వీర నరసింహరెడ్డి, వీహెచ్‌ఏ తస్లీమా రైతులు ఉన్నారు.

**నకరికల్లు:** రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ-క్రాప్‌లో పంటలు నమోదు చేసుకున్న రైతులు సత్వరమే ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని పిడుగురాళ్ల సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైరులో ఒక చదరపు మీటరు ప్రదేశంలో ఆకుల కత్తిరింపు, పిలకల తొలగింపు చేపట్టి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పొలం పరిసరాల విశ్లేషణలో గుర్తించిన అంశాలను చార్టుల ద్వారా వివరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.దేవదాసు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

**పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలి**

**బొల్లవరం(ముప్పాళ్ళ):** రైతులు సాగు చేసే పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఉప సంచాలకులు రత్నమంజుల చెప్పారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో రబీ సీజన్‌లో ఈ-పంట నమోదు ప్రక్రియను పల్నాడు జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటకు మద్దతు ధర, నష్టపరిహారం పొందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసి ఉండాలని స్పష్టం చేశారు. మొక్కజొన్న, శనగ పంటలను రవికుమార్ వ్యవసాయశాఖ కార్యాలయం సాంకేతిక వ్యవసాయాధికారి పి.అరుణచంద్రతో కలిసి పరిశీలించారు. నమోదు చేసిన పంట వివరాలు తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. ఏఓ ఎం.అరుణ, వీఆర్వో తోట సంజీవ రావు, వీఏఏ పి.శ్రీనివాసరావు, వీఆర్ఏ షేక్ బుడే రైతులు పాల్గొన్నారు.

## క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

**రాజుపాలెం:** క్షయ బాధితులు మందులు వాడే సమయంలో మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి వెంటనే తగ్గుతుందని డాక్టర్ కేవీ కృష్ణకుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిక్షయమిత్ర కార్యక్రమంలో భాగంగా ఆరుగురు క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్లు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, తహసీల్దారు నళిని, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రవితేజనాయక్, సూపర్ వైజర్లు జీవన్ రావు, ఉదయలక్ష్మి, ఉషారాణి, శివాంజనేయులు నాయక్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స



విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు, వైద్య సిబ్బంది

**నార్నెపాడు(ముప్పాళ్ళ):** క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే.. తగిన చికిత్స తీసుకొని జయించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బ్లాక్ లెవల్ హెల్త్ మేళా నార్నెపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులతో సైకిల్ ర్యాలీ, క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇంటి వద్దకే ఆరోగ్య సేవలందిస్తూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ జెండా ఊపి విద్యార్థుల సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, హెచ్ఎం ఎ.తిరుమలేశు, ఈఓపీఆర్డీ రూపవతి, సీహెచ్‌ఓ పి.ఆంజనేయులు, సూపర్‌వైజర్లు నాగమల్లేశ్వరరావు, పీటర్ డానియేల్, ఎంఎల్‌హెచ్‌పీ మణితేజ, శాంతకుమారి, ఏఎన్‌ఎమ్ లూర్దుమేరి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైక్లింగ్.. ఆరోగ్యకరం

**పెదకూరపాడు:** సైకిల్ తొక్కడం ఆరోగ్యకరమని 75త్యాళ్ళూరు వైద్యాధికారి వెలిగొండరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులు సైకిల్ తొక్కడం వల్లన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వెలిగొండ రెడ్డి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల క్యాన్సర్ కారణాలు, లక్షణాలు, ముందుగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లు, నివారణ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు.



పెదకూరపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

# సైక్లింగ్ విజేతలకు బహుమతులు



సైక్లింగ్ విజేతలతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

**నరసరావుపేట ఈస్ట్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్-17, అండర్-19 బాల బాలికల సైక్లింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. స్టేడియంలో ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పట్టణ వైద్యులు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, డాక్టర్ సురా ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు ఎం.గోపి, పి.వెంకయ్య, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

**విజేతల వివరాలు..**

అండర్-17 బాలుర విభాగంలో వి.ఎం.సూర్య కుమార్ (గుంటూరు), సతీష్ కుమార్ (కృష్ణా), రవితేజ (అనంతపురం)

బాలికల విభాగంలో పి.పల్లవి, షేక్.జాస్మిన్ (గుంటూరు), సి.మేఘన (కర్నూలు).

**టైమ్ స్టార్ట్ విభాగంలో..**

**బాలురు..**

ఎం.రాజు (అనంతపురం), కె.పృథ్వీరెడ్డి (గుంటూరు), పి.దిలీప్ (అనంతపురం).

**బాలికలు..**

పి.అనురాధరెడ్డి (గుంటూరు), మౌనిక, ఎస్.నటియా

**బాలురు అండర్-19 మాస్ స్టార్ట్ విభాగంలో..**

ఎస్.శ్రీనివాస్ (కృష్ణా), వై.వీరారెడ్డి (గుంటూరు), పి.ఒమరా వీరారెడ్డి.

**బాలికల విభాగంలో..** టి.కావ్యశ్రీ (గుంటూరు), వాసంతి (వైఎస్ఆర్ కడప), పూజిత (కృష్ణా).

టైంస్టార్ట్ బాలుర విభాగంలో ఎ.సాత్విక్ (కృష్ణా), కె.భవానిశంకర్ (గుంటూరు), నాగలోకేష్ (కృష్ణా) బాలికల విభాగంలో వి.భవాని, షేక్.కుషిందా(గుంటూరు), లిఖిత (కృష్ణా) విజేతలుగా నిలిచారు.

# విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటప్పయ్య

**నరసరావుపేట ఈస్ట్:** ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాలలోని విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని వారి అభ్యున్నతికి పాఠశాల స్థాయిలోనే పునాదులు వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య పేర్కొన్నారు. శంకరభారతీపురం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు పాఠశాలల్లో అనుసరించాల్సిన 40 అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీఈఓ వెంకటప్పయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలల్లో బోధన నాణ్యతను పెంచాలని సూచించారు. వ్యక్తి జీవితంలో పాఠశాల విద్య దశ అతి ముఖ్యమైనదిగా ప్రతి ఉపాధ్యాయుడు గుర్తించాలని కోరారు. పాఠశాల నుండే విద్యార్థుల వ్యక్తిగత నైపుణ్యాలు, లోపాలను గమనించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థి తన తరగతిలో ఏ గ్రేడ్ సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినట్లయితే ప్రతివిద్యార్థి తన నైపుణ్యాలను పెంచుకొని ఉన్నతంగా ఎదుగుతాడని స్పష్టం చేశారు. పాఠశాలలోని ప్రతి సౌకర్యాన్ని విద్యార్థి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాను త్వరలోనే ప్రతి పాఠశాలను వ్యక్తిగతంగా తనిఖీ చేస్తానని, ఆసమయంలో లోపాలను గమనించినట్లయితే కఠినచర్యలు తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో ఎంఈఓలు కె.జ్యోతికిరణ్, కె.పి.బాబురెడ్డి పాల్గొన్నారు.

### విద్యుత్ అధికారుల దాడులు

**చిలకలూరిపేటటౌన్:** విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారుల ఇళ్లపై విద్యుత్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట ఏడీఈ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టౌన్-2 పరిధిలో 33 బృందాలుగా ఏర్పడిన అధికారులు అనధికారికంగా విద్యు త్ వినియోగానికి పాల్పడుతున్న 100 సర్వీసులను గుర్తించి రూ.5,25,600 అపరాధ రుసుం విధించారు. వీరిలో విద్యుత్ చౌర్యం చేస్తున్న 3 కేసులు నమోదు చేసి, రూ. 1,14 లక్షలు అపరాధ రుసుం విధించారు. అదనపు లోడు వినియోగిస్తున్న వారిపై 94 కేసులు నమోదు చేసి రూ. 3,91 లక్షలు విధించారు. దాడుల్లో సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ ఈ టి.విజయకుమార్, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సీహెచ్ రమేష్, కేవీఎల్ఎస్ మూర్తి, చిలకలూరిపేట ఏడీఈ ఆర్ అశోక్ కుమార్, టౌన్ ఏఈఈ పి.భార్గవి పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన అవసరం



**అమరావతి:** క్యాన్సర్ వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన అవసరమని ఎంపీపీ మేకల హనుమంతరావు చెప్పారు. మంగళవారం రామకృష్ణహిందూ హైస్కూల్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. రవిబాబు క్యాన్సర్ రకాలు, లక్షణాలు వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ చంద్రశేఖర్, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ మాధురి, పాఠశాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు అవగాహన సైకిల్‌ర్యాలీ నిర్వహించారు.

### ఎంపీటీసీ కుటుంబానికి మంత్రి పరామర్శ



**మాదల(ముప్పాళ్ళ):** అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మాదల-2 ఎంపీటీసీ షేక్ గుంటూరు చినమాబు కుటుంబాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటిరాంబాబు మంగళవారం పరామర్శించారు. చినమాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. చినమాబు కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఉప సర్పంచ్ సైదా, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, మాజీ సర్పంచ్ రావిపాటి బసవయ్య, కానాలపుల్లారెడ్డి, చిమటా శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, నాగిరెడ్డి, నక్కా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.